రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:47 (బుధవారం ఉదయం)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 25 మార్చి 2025


ఆంధ్రజ్యోతి లక్కీడ్రా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, చిత్రంలో బ్రాంచి మేనేజర్ టి.పుల్లారావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ ఎస్.శంకర్‌రావు, బ్యూరో ఇన్‌చార్జ్ ఎన్.వెంకటరావు, కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ డి.రామారావు


విజేతకు ఫోన్‌లో అభినందనలు తెలుపుతున్న కలెక్టర్

విశ్వసనీయత ఊపిరి కావాలి


విజేత కూపన్‌ను చూపుతున్న కలెక్టర్


కూపన్లు కలుపుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఆ విలువను కాపాడుతోంది..

- ప్రభుత్వ పథకాలు ప్రజల దరిచేరడంలో పత్రికలది కీలకపాత్ర
- లోటుపాట్లను వాస్తవిక ధోరణిలో ఎత్తిచూపితే స్వీకరిస్తాం
- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- యూనిట్ కార్యాలయంలో ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి లక్కీడ్రా
- జిల్లా స్థాయిలో మొత్తం 103 మంది విజేతల ఎంపిక

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విశ్వసనీయ వార్తలతోనే పత్రికలను ప్రజలు ఆదరిస్తారని... పత్రికలు ప్రజలకు సమాచార వేదికలుగా పనిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సమాజంలో విలువలు, విశ్వసనీయత, నిజాయితీని ఆంధ్రజ్యోతి పత్రిక కాపాడుతోందని అభినందించారు. ఖమ్మంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రజ్యోతి జిల్లాస్థాయి లక్కీ డ్రా కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కార్యక్రమమైనా, పథకమైనా చేరాలంటే పత్రికల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విశ్వసనీయమైన వార్తలు ఇచ్చే ఏ పత్రికనైనా ప్రజలు ఆదరిస్తారని అన్నారు. అధికారులుగా తాము చేసే పనుల్లో ఏవైనా లోపాలుంటే, వాటిపైన పత్రికలు వాస్తవిక కథనాలను ప్రచురిస్తే తాము స్వాగతిస్తామని, తిరిగి పొరపాట్లు, లోటుపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అధికారులకు మార్గదర్శకంగా పత్రికలు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో తనదైన పాత్రను పోషిస్తున్న ఆంధ్రజ్యోతికి కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ తాళ్లూరి పుల్లారావు మాట్లాడుతూ గత 22 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటోందన్నారు. పత్రికను ఆదరిస్తున్న పాఠకులకు మరింత దగ్గరవ్వాలన్న సదుద్దేశ్యంతో కార్, బైక్ రేస్ డ్రాలను నిర్వహిస్తోందన్నారు. డ్రాలో ఎంపికైన వారికి బహుమతులను అందించడం ఆనవాయితీగా పెట్టుకుందన్నారు. కార్ రేస్ లక్కీడ్రాకు ప్రజలు చూపుతున్న ఆదరణ తమ బాధ్యతను మరింత పెంచుతుందన్నారు. ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి మాట్లాడుతూ విశ్వసనీయత, బాధ్యత ఆంధ్రజ్యోతికి (మిగతా 6వ పేజీలో)

- **మొదటి బహుమతి-మోటర్‌బైక్**
  తాటి రాజశేఖర్, బొట్లకుంట, కొణిజర్ల మండలం, సెల్: 97011 36700
- **రెండో బహుమతి- రిఫ్రిజిరేటర్ (185 లీటర్లు)**
  వెలిశాల శివరాణి, ఖానాపురంహవేలి, ఖమ్మం. సెల్: 93951 25832
- **మూడో బహుమతి- టీవీ (32 ఇంచులు)**
  కొమ్ము భవానిరాజ్, తుమ్మలగడ్డ, ఖమ్మం. సెల్: 75695 48188

1 ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు...

తాటి వెంకటేశ్వర్లు, బొట్లకుంట గ్రామం, కొణిజర్ల మండలం (మొదటి బహుమతి విజేత)



నేను గత కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పత్రికకు పాఠకుడిగా వున్నాను. ప్రతీ రోజు పొద్దున ఆంధ్రజ్యోతి పత్రికను చదివిన తర్వాతే నా దినచర్య మొదలవుతుంది. నాలుగు నెలల కూపన్లను భద్రపర్చుకొని, పత్రిక ఆఫీసుకు పంపాను. సోమవారం మధ్యాహ్నం జరిగిన లక్కీడ్రాలో నాకు మొదటి బహుమతి కింద మోటర్ బైక్ వచ్చిందని జిల్లా కలెక్టర్ స్వయంగా ఫోన్‌లో తెలియజేయడంతో ఎంతో ఆనందపడ్డాను. ఈ రోజును నేను ఎన్నటికీ మర్చిపోను. నా అభిమాన పత్రిక ఆంధ్రజ్యోతికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఆంధ్రజ్యోతి పాఠకుడినైనందుకు గర్విస్తున్నా.

-ఆంధ్రజ్యోతి, కొణిజర్ల

2 ఊహించని కానుక..

వెలిశాల శివరాణి, ఖానాపురం హవేలి, ఖమ్మం (రెండో బహుమతి విజేత)



ఎప్పట్నుంచో నేను ఆంధ్రజ్యోతి పాఠకురాలిని. ప్రతీసారి కార్ రేస్ పోటీలకు కూపన్‌లు పంపి పోటీలో పాల్గొంటాను. ఈ సారి డ్రాలో ద్వితీయ బహుమతి కింద రిఫ్రిజిరేటర్ దక్కడం ఆనందంగా ఉంది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చే వార్తలతో పాటు ఇలాంటి బహుమతులు మమ్మల్ని విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ కానుకను మర్చిపోలేను.

3 మొదటి ప్రయత్నంలోనే అదృష్టం

కొమ్ము భవానిరాజ్, తుమ్మలగడ్డ, ఖమ్మం (మూడో బహుమతి విజేత)



ఆంధ్రజ్యోతి కార్ రేస్ లక్కీ డ్రా జరుగుతుండటం చూసి నేను కూడా ఎందుకు పాల్గొనకూడదు అని భావించే వాడిని. ఆంధ్రజ్యోతి పేపర్‌కు గత ఐదేళ్ల నుంచి రెగ్యులర్ చందాదారుడిని. ఈ ఏడాది ఎలాగైనా కార్‌రేస్ పోటీలో పాల్గొనాలని భావించి ప్రతి నెలా కూపన్లు కట్‌చేసి డ్రా బాక్సులో వేశా. ఇప్పుడు మొదటిసారిగా తృతీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం స్పోర్ట్స్

100 మందికి కన్సోలేషన్ బహుమతులు
విజేతల జాబితా - 6లో...

భద్రాద్రికి మహర్దశ

- రామాలయ అభివృద్ధికి రూ.34కోట్ల నిధుల విడుదల
- జీవో నెం.93ని జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు ఇంటి యజమానులకు చెక్కుల పంపిణీ



భద్రాచలం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో మరో కీలక అధ్యాయానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం రూ.34కోట్ల నిధులను విడుదల చేస్తూ జీవో నెం.93ను జారీ చేసింది. వాస్తవానికి 2024 సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధి పనుల కోసం రూ.60.20 కోట్ల పత్యేక అభివృద్ధి నిధులను మంజూరు చేస్తూ జీవో నెం.246ను జారీ చేసింది. దీంతో రామాలయ అభివృద్ధి పనులకు భూ సేకరణ చేపట్టేందుకు అధికారికంగా (మిగతా 6వ పేజీలో)

ఇక సన్నబియ్యం సందడి

ఏప్రిల్ నుంచి రేషన్‌షాపుల్లో పంపిణీ

ఇన్నాళ్లు దొడ్డుబియ్యం తినలేక ఇబ్బందులు పడుతూ వాటిని బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించిన రేషన్‌దారులకు ఇకపై ఆ ఇబ్బందులు తొలిగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఏప్రిల్ 1 నుంచి ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం అందించనున్నారు. ఇందుకోసం పౌర సరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇప్పటికే రేషన్ దుకాణాలకు గోదాంల నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. నెలాఖరులోగా అన్ని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేసి ఆ తర్వాత ఏప్రిల్ కోటానుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు.

- దొడ్డు బియ్యం అక్రమాలకు చెక్
- ఉమ్మడి జిల్లాలో 7లక్షల మందికి లబ్ధి
- తెల్ల రేషన్‌కార్డు దారుల్లో ఆనందం
- బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.50పైనే..
- పేదవర్గాల ప్రజలకు ఎంతో ఉపయుక్తం



ఖమ్మం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇప్పటివరకు రేషన్‌కార్డు దారులకు ఒక్కొక్కరికి 6 కేజీల దొడ్డు బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. అయితే దొడ్డుబియ్యం తినేందుకు ఇష్టపడని లబ్ధిదారులు వాటిని కేజీ రూ.6నుంచి రూ.8 వంతున ప్రైవేటులో విక్రయిస్తున్నారు. కొందరు లబ్ధిదారులు డీలర్లకే ఆ బియ్యాన్ని అప్పగించి డబ్బులు తీసుకుంటున్నారు. ఆయా డీలర్లు ఆ బియ్యాన్ని కేజీ రూ.10నుంచి రూ.15కు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్నారు. జిల్లా కేంద్రాల్లో ఉండే బియ్యం వ్యాపారులు, కొంతమంది రైస్‌మిల్లు యజమానులు రేషన్‌బియ్యం కొనుగోలు చేసి రీసైక్లింగ్ ద్వారా తిరిగి సివిల్ సప్లయీస్‌కు సీఎంఆర్ కింద ఆ బియ్యాన్ని పంపుతున్నారు. అంతేకాకుండా కాకినాడ, విశాఖ పోర్టుల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తూ పేదల బియ్యంతో పెద్దలు కాసుల దందా సాగిస్తున్నారు.

అధికారులు అడపాదడపా రేషన్ బియ్యం లారీలను పట్టుకుంటున్నా.. శిక్షించే చట్టాలు నామమాత్రంగా ఉండడంతో స్టేషన్ బెయిల్‌పై అక్రమ రవాణాదారులు బయటికి వస్తూ మళ్లీ దందా సాగిస్తున్నారు. ఇకపై రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తుండడంతో కార్డుదారులు ప్రతీ ఒక్కరు ఆ బియ్యాన్ని వినియోగిస్తారు. వారికి మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేసే అవసరం ఉండదు. ప్రస్తుతం మార్కెట్‌లో సన్నబియ్యం కేజీ రూ.50వరకు ధర పలుకుతోంది. అలాంటి బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తే లబ్ధిదారులు వాటిని బయట విక్రయించకుండా తామే వాడుకునే అవకాశం ఉంటుంది. దాంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కూడా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

రేషన్ దుకాణాలకు సన్నబియ్యం

ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏప్రిల్ 1న నల్లగొండ జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనుండడంతో (మిగతా 6వ పేజీలో)

బాలికను వంచించిన యువకుడు

పోక్సో కేసు నమోదు

ఎర్రుపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎర్రుపాలెం ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రుపాలెం మండలంలోని భీమవరానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ముల్లంగి జమలయ్య పెళ్లి చేసుకుటానని ప్రేమపేరుతో నమ్మించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫలితంగా బాలిక గర్భం దాల్చింది. పెళ్లి చేసుకుందామని నమ్మబలికి ఓ ఆర్‌ఎంపీ సాయంతో బాలికను తన తల్లిదండ్రులతో కలిసి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ అబార్షన్ చేసేందుకు యత్నిస్తున్నారని గమనించిన బాలిక వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరింది. బంధువుల సాయంతో న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించింది. నిందితుడు జమలయ్యపై పోక్సో నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

26న మహిళలకు జాబ్ మేళా

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 26న తనికెళ్ల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాల (లక్ష్య ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం)లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విజయవాడలో పని చేసే విధంగా ఫాక్స్ కాన్, సెన్సా కోర్, ఆల్ఫా, భారత్ బయోటెక్, శిందర్, లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎలాన్సర్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, జస్ట్ ఇన్ ఫౌండేషన్, సీతారాం స్పిన్నర్స్ ప్రైవేటు లిమిటెడ్, జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, ఎంపవర్‌మెంట్ సర్వీసెస్, క్రీం స్టోన్ కంపెనీలలో పని చేసేందుకు 18-30 ఏళ్ల వయస్సు గల డిగ్రీ పాసైన మహిళలు అర్హులని, ఎంపికైన వారికి వేతనం రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఉంటుందన్నారు. 1370 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో మహిళలు జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో కోరారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ..

- కారు చెట్టుకు ఢీకొని ఇద్దరు మృతి
- మృతులు దానవాయిగూడెం వాసులు



పల్లపు రాము, కేతం కృష్ణమూర్తి మృతదేహాలు

ఖమ్మం రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో దైవ దర్శనం చేసుకొని వస్తూ మరో 10నిమిషాల్లో ఇంటికి చేరతామనుకున్న వారిని మృత్యువు కబళించింది. కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని ఏదులాపురం మునిసిపాలిటీ వరంగల్ క్రాస్‌రోడ్డులోని ఆటోనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన పల్లపు రాము (46), అతడి స్నేహితులు కేతం క్రిష్ణమూర్తి (50), బండారి సురేష్ కలిసి ఈనెల 22న కారులో శ్రీశైలం వెళ్లారు. దైవదర్శనం పూర్తి చేసుకుని ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఆటోనగర్ వద్ద అర్ధరాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పల్లపు రాము అక్కడికక్కడే మృతిచెందాడు. కేతం కృష్ణమూర్తి, సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కేతం కృష్ణమూర్తి సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రాము మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాము భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

'గూడెం'కు కొత్త కళ

- మునిసిపల్ కార్పొరేషన్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని
- గవర్నర్ ఆమోదం తర్వాత జారీ కానున్న గెజిట్


కొత్తగూడెం పట్టణం



కొత్తగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండల పరిధిలోని ఏడు పంచాయతీలను కలుపుతూ కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం లభించింది. ఈ మేరకు ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం సాయంత్రం అసెంబ్లీలో ప్రకటించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలోని 36 వార్డులు, పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని 24 వార్డులు, సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్, నాయకులగూడెం, కోమటపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, లక్ష్మీదేవిపల్లి, నర్సింహసాగరం పంచాయతీలతో కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటైంది. ఈ కార్పొరేషన్ పరిధిలో సుమారు 2.50లక్షల జనాభా ఉంది.

కొత్తగూడెం కార్పొరేషన్ బిల్లుకు అసెంబ్లీలో సభ్యులు ఆమోదం తెలపడంతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటు సహకరించిన (మిగతా 6వ పేజీలో)

వేటకు వెళ్లి యువకుడి మృతి 6



కార్యాలయంలోని డెస్క్ విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



కూపన్ తీస్తున్న కలెక్టర్



కూపన్ తీసి విజేతను ప్రకటిస్తున్న కలెక్టర్

ఆంధ్రజ్యోతి లక్కీడ్రా విజేతలు వీరే..

ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లాస్థాయి లక్కీ డ్రా కార్యక్రమం సోమవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ కూపన్లను తీసి విజేతలకు ఫోన్ చేసి అభినందించారు. అనంతరం కన్సోలేషన్ విజేతలను ఎంపిక చేశారు. వారి పేర్లు...

మొదటి బహుమతి-మోటర్‌బైక్

తాటి రాజశేఖర్, ఇ.నెం.10-54, ఎస్సీ కాలనీ, బొట్లకుంట, కొణిజర్ల, ఖమ్మం, జిల్లా. సెల్: 9701136700

రెండో బహుమతి- 185 లీ.రిఫ్రిజిరేటర్,

వెలిశాల శివరాణి, 15-19-142/1, బాలాజీనగర్, ఖానాపురంహవేలి, ఖమ్మం. సెల్: 9395125832

మూడవ బహుమతి- 32" టీవీ,

కొమ్ము భవానిరాజ్, 8-6-88/1, తుమ్మలగడ్డ, ఖమ్మం. సెల్:7569548188

కన్సోలేషన్ బహుమతులు-100మందికి

1. మద్ది నవీన్‌రాజ్, ఇల్లెందు, సెల్: 9949515291
2. నార్లపాటి రామారావు, అశ్వారావుపేట, సెల్: 6305076358
3. బంటు జ్యోత్స్న, ఇల్లెందు. సెల్: 9014060039
4. శ్రీరామమెడికల్‌అండ్ జనరల్ స్టోర్స్, భద్రాచలం, సెల్: 9505423030
5. బి.మౌనిక ఉదయశ్రీ, మాటూరు, మధిర, సెల్: 9966818697
6. గుగులోత్ రాజేశ్వరి, బల్లేపల్లి, ఖమ్మం సెల్: 9676368257
7. కొడుమూరి జ్యోత్స్న, ప్రకాష్‌నగర్, ఖమ్మం. సెల్: 9959356574
8. మాతంగి శ్యామలరావు, మధిర, సెల్: 8977627292
9. కల్లూరి గౌతమ్‌దొర, బాలరాజుగూడెం, దమ్మపేట, సెల్: 9866576972
10. కాట్రగడ్డ రమేష్, ఖానాపురంహవేలి, ఖమ్మం. సెల్: 9441419012
11. చిన్మయశ్రీ, చైతన్యనగర్, ఖమ్మం, సెల్: 9493239614
12. పి.వెంకటరమణారెడ్డి, లక్ష్మీనగర్, దుమ్ముగూడెం, సెల్: 8074880646
13. అనూష ఎలక్ట్రికల్స్, వైరా సెల్: 9848396764
14. కె.గాయత్రి, ఖానాపురంహవేలి, ఖమ్మం. సెల్: 7207831301
15. చింతల సూర్యనారాయణ, విద్యానగర్, కొత్తగూడెం, సెల్: 9848434636
16. మోదుగు అయాన్, లాలాపురం, కొణిజర్ల, సెల్: 9885661137
17. టి.వినిత్‌కుమార్, తాళ్లగొమ్మూరు, బూర్గంపాడు, సెల్: 9951011984
18. ఆర్.పార్వతీదేవి, గంగారం, సత్తుపల్లి, సెల్: 9640298056
19. ఎస్‌కే అమీర్, గన్నవరం, వైరా, సెల్: 9059740584
20. బి.గణేష్‌చంద్రబాబు, శ్రీనగర్‌కాలనీ, ఖమ్మం.సెల్: 9440025956
21. కె.సంజన, తిప్పనపల్లి, చంద్రుగొండ, సెల్: 6309834439
22. పి.శ్రీరాంసురేష్, వైరా, సెల్: 9440375173
23. కె.రుద్రక్రిష్ణ, కవిరాజ్‌నగర్, ఖమ్మం. సెల్: 9848675558
24. సీహెచ్ రాజ్యం, సాయిఆదిత్యనగర్, ఖమ్మం. సెల్: 8185881973
25. ఎం.రమేష్, రామాటాకీస్ ఏరియా, కొత్తగూడెం, సెల్: 8143532583
26. వై.తన్మయ్, కొత్తగూడెం, సెల్: 9493039074.
27. కె.మంగ, బొక్కలగడ్డ, ఖమ్మం. సెల్: 6309747350
28. జక్కంపూడి కావ్యశ్రీ, వెంకటగిరి, తల్లాడ. సెల్: 994867558
29. ఎన్.బాలకృష్ణ, చైతన్యనగర్, ఖమ్మం. సెల్: 9885559239
30. పి.ఎలివెన్ శాంషన్‌రాజు, చెర్వుబజార్, ఖమ్మం. సెల్: 9390490877
31. గుర్రం వెంకటేశ్వర్లు, ప్రగళ్లపాడు, టేకులపల్లి, సెల్: 9177328631
32. వై.రూప, కూనవరం రోడ్, భద్రాచలం సెల్: 8074033974
33. ఇ.ప్రభాకర్, పినపాక, సెల్: 9985424173
34. కొక్కిరేణి హరీష్‌దేవ్, మామిళ్లగూడెం, ఖమ్మం, సెల్: 9951154075
35. బి.వెంకటేష్, టేకులతండ, కామేపల్లి, సెల్: 9391010500
36. బుగ్గవరపు రమణమ్మ, గుట్టబజార్, ఖమ్మం, సెల్: 9347903674
37. తవిడిశెట్టి రవికుమార్, అద్దెకావేరి వీధి, ఖమ్మం, సెల్: 9848096577
38. మేడి సుహానిషా, నూతనకల్, తల్లాడ, సెల్: 9985117649
39. టి.కృష్ణవేణి, కంప్యూటర్ కాలనీ, ఖమ్మం, సెల్: 94922644632
40. యలమందల దుర్గాబాబు, రజకవీధి, ఖమ్మం,సెల్: 8522931003
41. తీగ పునర్వి, రాయగూడెం, నేలకొండపల్లి, సెల్: 9912496998
42. బి.సుధ, కవిరాజ్‌నగర్, ఖమ్మం, సెల్: 9398684851
43. నడికొప్పుల లాలయ్య, బొక్కలగడ్డ, ఖమ్మం, సెల్: 9948714120
44. వి.విజయ, వైరా, సెల్: 9704568019
45. కె.రమాదేవి, తిప్పనపల్లి, చంద్రుగొండ, సెల్: 6309834439
46. కే.నవీన్, వరంగల్ క్రాస్‌రోడ్, ఖమ్మం, సెల్: 9618829173
47. తిరగమళ్ల అభిషేక్, గాంధీనగర్, ఖమ్మం, సెల్: 9154044433
48. ఎం.సునీత, భద్రాచలం, సెల్: 8688631068
49. పువ్వునేని రాంబాబు, శాంతినగర్, ఖమ్మం, సెల్: 9866493049
50. కె.గౌరీ మనోహర్, ప్రశాంతినగర్, కొత్తగూడెం, సెల్: 9550293972
51. కూరపాటి చంటి, ఏన్కూరు, సెల్: 7893319112
52. గుజ్జు హరి, కవిరాజ్‌నగర్, ఖమ్మం, సెల్: 99852277879
53. ఎన్.శ్రీనివాస్, చైతన్యనగర్, ఖమ్మం, సెల్: 8763659138
54. కె.వెంకటనాగభాస్కరరావు, శ్రీనగర్‌కాలనీ, ఖమ్మం.సెల్: 9059376337
55. ఎం.బాలాజీ, గోవింద్రాలబంజర, కామేపల్లి, సెల్: 9642464039
56. వై.శ్రీవర్ష, చుంచుపల్లి, కొత్తగూడెం, సెల్: 9398393025
57. ఎన్.శిల్ప, సత్తుపల్లి, సెల్: 9705050413
58. గంద్ర వెంకటేశ్వర్లు, గణేష్‌నగర్, ఖమ్మం, సెల్: 7702800079
59. కె.నాగప్రసాదరావు, దురదపాడు, దమ్మపేట, సెల్: 8639392555
60. కె.ప్రసాద్, బల్లేపల్లి, ఖమ్మం, సెల్: 7075421625
61. ఎస్‌కె సిద్దయ్య, పొద్దుటూరు, చింతకాని, సెల్: 9951795980
62. ఎం.రిషిక, లక్ష్మీనగరం, దుమ్ముగూడెం సెల్: 9441864423
63. ఆర్.లక్ష్మిభువనశ్రీ, గంగారం, సత్తుపల్లి, సెల్: 8688377269
64. లాలాజీ జ్ఞానేశ్వర్, కూలీలైన్, కొత్తగూడెం, సెల్: 9177248384
65. పీఎన్ రాజేశ్వరి, కన్నాయిగూడెం, భద్రాచలం, సెల్: 7337587429
66. డేగల స్వాతి, నర్సింహులగూడెం, కూసుమంచి, సెల్: 9666820941
67. కాక వెంకటేశ్వరరావు, అంకంపాలెం, దమ్మపేట, సెల్: 9550848596
68. చావా అనిల్, గణేష్ నగర్, ఖమ్మం, సెల్: 9550104725
69. తుళ్లూరి గీత, గణేష్ నగర్, ఖమ్మం, సెల్: 7095527376
70. చీజర్ల విజయ్‌కుమార్, కలకొడిమ, తల్లాడ, సెల్: 9642168240
71. కొర్లపాటి మహతి, వినోబానగర్, ఇల్లెందు, సెల్: 9866566344
72. జక్కంపుడి జనని, సత్తుపల్లి, సెల్: 9666767834
73. ఆళ్ల రమేష్, కైకొండాయిగూడెం, ఖమ్మం. సెల్: 9666784475
74. ఎస్‌కే మెహరన్, లెనిన్‌నగర్, ఖమ్మం, సెల్: 8897650285
75. పునాటి గీత, సుందరయ్యనగర్, మధిర, సెల్: 9908307066
76. టి.అధిర, చైతన్యనగర్, ఖమ్మం, సెల్: 7675074616
77. ఏ.కీర్తి, సీహెచ్ మాధారం, నేలకొండపల్లి, సెల్: 9133956728
78. నీరుడు రాము, బాలాజీనగర్, ఖమ్మం, సెల్: 9948628224
79. ఏటుకూరి విజయలక్ష్మి, సారధినగర్, ఖమ్మం, సెల్: 9848240305
80. డి.రాము, యూపీహెచ్ కాలనీ, ఖమ్మం, సెల్: 7780396538
81. టి.ఉమారాణి, మంచికంటినగర్, ఖమ్మం, సెల్: 8143577635
82. పొనగంటి శ్రీదేవి, నాగుపల్లి, దమ్మపేట సెల్: 9505289788
83. జి.కార్తికేయ, ఖానాపరం, ఖమ్మం, సెల్: 9441419012
84. ఎన్.అంజనేయులు, మద్దుకూరు, చంద్రుగొండ, సెల్: 9908053834
85. జుజ్జవరపు శ్రీనివాసరావు, మణుగూరు, సెల్: 7330840888
86. మద్దినేని నాగేశ్వరరావు, పెద్దతండా, సెల్: 9505436303
87. కొల్లా నాగేశ్వరరావు, శ్రీకృష్ణనగర్, ఖమ్మం, సెల్: 6303708434
88. తోకల హరీష్, అశ్వారావుపేట, సెల్: 990884558
89. దేవరశెట్టి రంగారావు, పాల్వంచ, సెల్: 9290874740
90. టి.రేఖ, చుంచుపల్లి, కొత్తగూడెం, సెల్: 9963809326
91. ఎన్.వీరభద్రరావు, మమతా ఆస్పత్రి రోడ్, ఖమ్మం, సెల్: 9490772742
92. శీలం మనస్విరెడ్డి, లక్ష్మీపురం, తల్లాడ, సెల్: 9949744351
93. సీహెచ్ రాధాకృష్ణ, రాఘవేంద్రనగర్, ఖమ్మం,సెల్: 8985525064
94. కొమ్మినపల్లి హరిబాబు, వేంసూరు, సెల్: 9866575452
95. ఏ.నాగలక్ష్మి, సుందరయ్యనగర్, వైరా, సెల్: 8125943574
96. వీవీ కామేశ్వరి, వనమా స్ట్రీట్, పాల్వంచ, సెల్: 8970523949
97. పి.శ్రీహర్షిత్ మణిదీప్, వి.వెంకటాపురం, వేంసూరు, సెల్: 9014975103
98. ఎం.చరణ్‌సాయి, బ్యాంక్ కాలనీ, ఖమ్మం, సెల్: 8247829772
99. పి.సత్యం, జూలూరుపాడు, సెల్: 9849351462
100. జె.శ్రీదేవి, గాంధీనగర్, ఖమ్మం, సెల్: 8309974038





కన్సోలేషన్ విజేతలను ఎంపిక చేస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

విశ్వసనీయత ఊపిరి కావాలి...

(5వ పేజీ తరువాయి)

రెండు కళ్లు అని పేర్కొన్నారు. పాఠకులతో ఉద్వేగపూరిత బంధం ఏర్పరుచుకోవడానికి లక్కీడ్రా ద్వారా విలువైన బహుమతులను అందజేయడం జరుగుతోందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి నిర్వర్తిస్తున్న పాత్ర ఎంతో విలువైందని తెలిపారు. వినూత్నమైన శీర్షికలు, ప్రత్యేక కథనాలతో పత్రికారంగంలో తనదైన స్థానాన్ని పదిలపర్చుకుందని తెలిపారు. బ్యూరో ఇన్‌చార్జి నలజాల వెంకటరావు మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతి ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా పనిచేస్తుందన్నారు. సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి వేదికగా పనిచేస్తోందన్నారు. ఆంధ్రజ్యోతి దినదిన ప్రవర్ధమానం అవుతోందని, కార్ రేస్ లక్కీడ్రాకు వస్తున్న ఆదరణే ఇందుకు కొలమానం అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఏబీఎన్ ఇన్‌చార్జి శ్రీధర్, సర్క్యులేషన్ మేనేజర్ ఎంవీ సూర్యనారాయణ, యాడ్స్ మేనేజర్ రమేష్ బాబు, స్టాఫ్ రిపోర్టర్ తాళ్లూరి రమేష్, సబ్ ఎడిటర్లు కె.కృష్ణమోహన్, పాల రమేష్, రిపోర్టర్లు బి.రాఘవ, సాతుపాటి రాము, తాళ్లూరి మూర్తి, నర్సింహారావు, రిషి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. ఎడిటోరియల్, సిస్టమ్స్, ప్రింటింగ్ విభాగాలను ఆసక్తిగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు



ఎడిషన్ ఇన్‌చార్జ్ శంకర్‌రావు శెంకేసి



బ్యూరో ఇన్‌చార్జ్ నలజాల వెంకటరావు

వెల్లువెత్తిన కూపన్లు...

ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పాఠకులకు విలువైన బహుమతులు అందించేందుకు యాజమాన్యం 'కార్ అండ్ బైక్ రేస్' పేరుతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో లక్కీడ్రా కార్యక్రమం ఏర్పాటు చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పాఠకులకు మొత్తం కోటి రూపాయల విలువైన బహుమతులు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం గత నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రతీ నెలా మూడు కూపన్లను ప్రచురించి పాఠకుల నుంచి స్వీకరించింది. నాలుగు నెలల కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వేలాది మంది పాఠకులు తమ కూపన్లను పంపారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతిగా మోటర్ బైక్, రెండో బహుమతిగా రిఫ్రిజిరేటర్ (185 లీటర్లు), మూడో బహుమతిగా టీవీ (32 ఇంచులు), 100 కన్సోలేషన్ బహుమతులు (రూ.2వేల విలువ)ను నిర్దేశించారు.

ఉత్సాహంగా లక్కీడ్రా..

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో లక్కీ డ్రా కార్యక్రమం జరిగింది. తొలుత కూపన్లను కుప్పగా పోసి అనేకసార్లు మిక్సింగ్ చేశారు. వందలాది మంది పాఠకుల సమక్షంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ డ్రా తీయడం ద్వారా విజేతలను స్వయంగా ఎంపిక చేశారు. మొదటి బహుమతి(మోటార్ బైక్)ని కొణిజర్ల మండలం బొట్లకుంటకు చెందిన తాటి రాజశేఖర్ గెలుచుకున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి అభినందించారు. రెండో బహుమతిగా రిఫ్రిజిరేటర్ (185 లీటర్లు)ని ఖమ్మం నగరం ఖానాపురం హవేలికి చెందిన వెలిశాల శివరాణి గెల్చుకున్నారు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడుతూ 'అమ్మా.. మీరు ఆంధ్రజ్యోతి డ్రాలో ఫ్రిజ్‌ను గెలుచుకున్నారు..' అని చెప్పడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. మూడో బహుమతిగా టీవీ (32 ఇంచులు)ని ఖమ్మం తుమ్మలగడ్డకు చెందిన కొమ్ము భవానిరాజ్ గెల్చుకున్నారు. ఫోన్‌లో ఆయనకు కూడా కలెక్టర్ అభినందనలు తెలుపగా 'టీవీ ఎప్పుడిస్తారు సార్...?' అని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ పుల్లారావు, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు కన్సోలేషన్ బహుమతుల విజేతలను ఎంపిక చేశారు. మొత్తం 100 మందిని ప్రకటించారు. విజేతలకు త్వరలో బహుమతులను అందించనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ తెలిపారు.

పంటల మార్పిడిపై రైతుల్లో అవగాహన పెంచాలి

కృషి విజ్ఞాన కేంద్రంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ప్రసంగిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు

వైరా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడి విధానం అమలుపై రైతుల్లో అవగాహన కల్పించాలని, పంటల సాగులో రైతులకు లాభాలు పెంచటమే లక్ష్యంగా పనిచేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రెండురోజుల పాటు ఉమ్మడి మెదక్, ఖమ్మం, వరంగల్ జిల్లాలస్థాయి మధ్య తెలంగాణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం సోమవారం ప్రారంభమైంది. ఈ సమావేశానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతుల్లో నమ్మకం కలిగించేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయాలని పేర్కొన్నారు. 1950 తర్వాత దేశంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార సంక్షోభం ఏర్పడినప్పుడు ఆధునిక పద్ధతుల్లో హరిత విప్లవం లక్ష్యంగా కృషిచేసి నేడు దేశ అవసరాలకు మించి ఆహార ఉత్పత్తులను సాధిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గత 15 నుంచి 20ఏళ్లుగా రైతుల ఆదాయం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల కారణంగా రైతులు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. వరిపంటపైనే అధికంగా రైతులు ఆధారపడటం మంచిది కాదని, ప్రత్యామ్నాయ పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని, మార్కెటింగ్, సహకార వ్యవస్థ వంటి వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. గతంలో ఏడాదికి ఎకరం ఒక్కంటికి వరిపంటపై రూ.40 వేల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం రూ.20వేల ఆదాయం రాకపోయినా అదే పంటను కొనసాగిస్తున్నారని అయితే రైతులు ఆయిల్‌పామ్, కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్ వంటి లాభసాటి పంటలపై దృష్టిసారించాలని సూచించారు. రైతులతో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం మమేకమవుతూ ప్రత్యామ్నాయ పంటల సమాచారాన్ని అందిస్తూ వారిని ప్రోత్సహించాలని సూచించారు. నూతన సాగుపద్ధతులు మొదట పెద్ద రైతుల ద్వారా అమలు చేయాలని పేర్కొన్నారు. ల్యాబ్ టూ ల్యాండ్ విధానం అమలుపై దృష్టిసారించాలన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రతి గ్రామం, మండలం, డివిజన్, జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి, మండలస్థాయిలో తహసీల్దార్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో ఆధ్వర్యంలో ఏడుశాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. నీటిపారుదల, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని, ఈ సమన్వయం వల్ల ప్రస్తుతం ఎకరం పంట కూడా ఎండిపోకుండా సాగునీరందించామని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ బలరాం, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఎం.యాదాద్రి, వరంగల్ ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, డీడీఏ సింగారెడ్డి, ఆర్ఈఏసీ మెంబర్ తుమ్మల రాణాప్రతాప్, కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు జూట్ బ్యాగ్ అందిస్తున్న శాస్త్రవేత్తలు

భద్రాద్రికి మహర్దశ

(5వ పేజీ తరువాయి)

ఆమోద ముద్ర లభించినట్టు అయ్యింది. ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన భూ సేకరణ కోసం ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దానిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రభుత్వానికి నివేదించారు. ఈ క్రమంలో రామాలయ అభివృద్ధి కోసం 45 ఇంటి యజమానులకు చెల్లింపులు చేసేందుకు అవసరమైన రూ.34కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.93 ద్వారా సోమవారం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన నిధులు జిల్లా ప్రణాళిక అధికారి ఖాతాకు జమ అయ్యాయని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీంతో చెల్లింపులు చేసేందుకు సంబంధిత ఇంటి యజమానులకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు శ్రీనివాసరావుకు సూచించినట్టు తెలిపారు. ఈ చెల్లింపులను రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఇప్పటికే రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు భూ సేకరణ పనులు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని భద్రాద్రి పర్యటనలో స్పష్టం చేశారు. ఏప్రిల్ ఆరున శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్‌రెడ్డి తేనుండటంతో ఈ క్రమంలో రామాలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్టు వెల్లడించారు.

ఈ విషయమై రెవెన్యూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిలతో సీఎం రెండు రోజుల క్రితం మాట్లాడారు. ఈ నేపథ్యంలో అందరూ ఊహించినట్టుగానే నిధులను విడుదల చేశారు. కాగా శ్రీరామనవమి నాడు సీఎం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నప్పటికీ ఇళ్లను నవమి అనంతరం తొలగించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

'గూడెం'కు కొత్త కళ

(5వ పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, జిల్లా ఇంచార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు. మునిసిపల్ సెక్రటరీ దాన కిషోర్‌తో పాటు మంత్రి మండలికి, అసెంబ్లీ సభ్యులందరికీ ఎమ్మెల్యే కూనంనేని స్వయంగా అసెంబ్లీ లోనే కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఆమోదం లభించడంతో తరువాత గవర్నర్ ఆమోదంతో త్వరలో గెజిట్ విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసి సాధించానని, కొద్దిరోజుల్లోనే కొత్తగూడెం ప్రాంతం ఇతర నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల కొత్తగూడెం ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ప్రజల ఆస్తులకు విలువ పెరుగుతుందన్నారు. ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్న కొత్తగూడెం ప్రాంతంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కలుగుతుందని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో విస్తారంగా ఉన్న బొగ్గు, విద్యుత్, అటవీ, ఖనిజ సంపద ఆధారిత పరిశ్రమల ఏర్పాటు వేగవంతం కానుందన్నారు. ఎప్పటి నుంచో నిలిచిపోయిన పాల్వంచ మునిసిపల్ ఎన్నికలకు అడ్డంకులు తొలిగిపోయాయన్నారు. కూనంనేని ఎమ్మెల్యేగా ఎన్నికైన 15నెలల్లోనే కార్పొరేషన్ సాధించి నియోజకవర్గ ప్రజలకు గెలుపు ఫలాలు అందించడంతో అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఇక సన్నబియ్యం సందడి



(5వ పేజీ తరువాయి)

అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని కార్డుదారులకు కూడా ఇకపై సన్నబియ్యం సరఫరా చేయనున్నారు. ఇందుకోసం గోదాంల్లోని సన్నబియ్యాన్ని గత రెండురోజులుగా రేషన్‌డీలర్లకు పంపిణీ చేస్తున్నారు. సన్నబియ్యం అక్రమ రవాణ జరగకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఖమ్మం జిల్లాలో 748 రేషన్‌షాపుల ద్వారా సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 4లక్షల 11 రేషన్‌కార్డు దారులకు అందించనున్నారు. వీటితోపాటు అన్నపూర్ణ, ఎఫ్ఎస్‌సీ కార్డులు, ఏఎఫ్ఎస్‌సీ కార్డుదారులకు కూడా సన్నబియ్యం అందనున్నాయి.

అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2లక్షల 93వేల మంది రేషన్ కార్డులకు 5 వేల మె.ట. సన్నబియ్యం అందించనున్నారు. ఈ మేరకు ఇరు జిల్లాల్లోని సివిల్ సప్లయాస్ అధికారులు, కార్పొరేషన్ అధికారులు రేషన్‌షాపులకు ముందస్తుగానే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సన్నబియ్యం రేషన్‌షాపుల ద్వారా అందించే కార్యక్రమం ప్రారంభంకావడంతో తెల్లరేషన్ కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం ఇక లబ్ధిదారుల ఇంటికే చేరనున్నాయి.

అన్ని రేషన్‌షాపులకు సన్నబియ్యం

చందన్‌కుమార్, డీఎస్వో

జిల్లాలోని అన్ని రేషన్‌షాపులకు సన్నబియ్యం ముందుగానే పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 748 రేషన్‌షాపులుండగా అన్ని దుకాణాలకు సన్నబియ్యం కోటా ప్రకారం పంపిణీ చేస్తున్నాం. ఏప్రిల్ 1నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. ప్రస్తుతం దొడ్డు బియ్యం ఈనెలాఖరు వరకే పంపిణీ చేస్తాం. వచ్చే నెలా కోటా నుంచి సన్నబియ్యం మాత్రమే అందిస్తాం. జిల్లాలో సన్నబియ్యం కొరతలేదు. అన్ని గోదాంలలోనూ సన్నబియ్యం ఉంది. అలాట్‌మెంట్ ప్రకారం రేషన్‌షాపులకు సన్నబియ్యం వెళుతున్నాయి.

వేటకు వెళ్లి యువకుడి మృతి

- **విద్యుత్ తీగలు తగిలాయంటున్న సహచరులు**

ఏన్కూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన ఏన్కూరు మండలం నెమలిపురిలో జరిగింది. కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన మేకల కరుణాకర్ (18) 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమలపాడుకు చెందిన జక్కుల రాములు అడవి జంతువుల వేట కోసం తరుచూ కరుణాకర్‌ను తీసుకొని వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో జక్కుల రాములు, అతని కుమారుడు ప్రవీణ్ ఇద్దరు కలిసి కరుణాకర్‌ను తీసుకొని వేటకు వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో కానీ, రాత్రి 9 గంటల సమయంలో రాములు.. చీమలపాడులోని కరుణాకర్ ఇంటికి వచ్చి 'మీ కుమారుడు విద్యుత్ వైర్లు తగలి మృతి చెందాడు..' అని అతడి తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో తండ్రి కోటయ్య, బంధువులు సంఘటన స్థలం వద్ద చూడగా కరుణాకర్ విగతజీవిగా కనిపించాడు. అయితే విద్యుత్ వైర్లను ఎవరు అమర్చారనేది తెలియరాలేదు. నిత్యం వేటకు వెళ్లే రాములు అమర్చాడా..? ఇతరులు అమర్చారా..? అనేది తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి మేకల కోటయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. సంఘటనా స్థలాన్ని సోమవారం ఎస్ఐ రఫీ, సీఐ ముత్తులింగం, ఎఫ్ఆర్వో శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కాగా, మృతుడు కరుణాకర్ అవివాహితుడు.



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో మూడో ట్రాక్ పనులను పరిశీలిస్తున్న సేఫ్టీ అధికారి మాధవి తదితరులు

మూడో లైన్ ఫిట్‌నెస్ తనిఖీ

- **దక్షిణమధ్యరైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రాక**

ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి పందిళ్లపల్లి రైల్వేమార్గంలో పూర్తయిన మూడో లైన్ పనులను సోమవారం దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆమె తొలుత ఖమ్మం స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మూడో రైల్వే లైను పనులు నాణ్యతతో పాటు సేఫ్టీ పరీక్షలు నిర్వహించారు. ఆమె ఖమ్మం నుంచి పందిళ్లపల్లి వరకు మోటార్ ట్రాలీపై వెళ్లి స్పీడ్ టెస్ట్ నిర్వహించారు. ఎక్కడైనా కొత్తగా రైల్వే ట్రాక్ పనులు పూర్తయిన తర్వాత వాటి సామర్థ్యంతో పాటు సేఫ్టీ తదితర అంశాలను పరీక్షించిన తర్వాత ఆ మార్గంపై రైళ్ల రాకపోకలను అనుతించనున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నుంచి పందిళ్లపల్లి మార్గంలో నిర్మించిన ఈ మార్గాన్ని ఆమె పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. త్వరలో ఈ ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను అనుమతించనున్నట్టు తెలిసింది. ఆ పరీక్షల కోసం ఆమె వెంట డీఆర్ఎం భరతేష్‌కుమార్ జైన్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ సురేష్‌రెడ్డి, సీనియర్ డీఎస్వో, ఏసీఎం రవి, ఇన్‌చార్జి సీసీఐ ప్రసన్నకుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్ తదితరులున్నారు.



పకడ్బందీగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

కె. రాంగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి, ఖమ్మం

ప్రశ్న: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి?

జ: జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 67వేల మంది పిల్లలున్నారు. 7నెలలనుంచి 3ఏళ్ల పిల్లలకు ఇంటికే గుడ్లు, బాలామృతం పంపిస్తున్నాం. 3నుంచి 5ఏళ్ల పిల్లలకు కేంద్రాలలోనే ఉడికించిన కోడిగుడ్డుతో పాటు భోజనం సదుపాయం ఇస్తున్నాం. 3 నెలల గర్భిణి నుంచి ప్రసవం తర్వాత 7నెలల వరకు బాలింతలకు కోడిగుడ్లు, భోజనం అందజేస్తున్నాం.

ప్ర: అంగన్‌వాడీల సమయం ఏమిటి?

జ: ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కేంద్రాలు ఉంటాయి. వేసవి కావడంతో ఉదయం 8-30గంటలనుంచి 12-30గంటల వరకు నిర్వహిస్తున్నాం. జిల్లాలో 1,840 మంది అంగన్‌వాడీ టీచర్లుకుగాను 206 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1,840మంది ఆయాలకు గాను 603 ఆయాపోస్టులు ఖాళీగా ఉన్నాయి. 65 ఏళ్ల దాటిన వారిని తొలిగించమని ఆదేశాలున్నందున వారిని తొలిగించడంతో ఖాళీలు ఏర్పడ్డాయి.

ప్ర: అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలన పరంగా మార్పులు ఏమైనా ఉన్నాయా?

జ: ఖమ్మం వంటి నగరంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పిల్లలు రావడంలేదు. అలాంటి సెంటర్లను గుర్తించి అదే నగరంలోని శివారు కాలనీలకు తరలిస్తాం. ఇప్పటికే జిల్లాలో ఖమ్మంలో రెండు కేంద్రాలను శివారు కాలనీలకు తరలించాం.

ప్ర: మోడల్ కేంద్రాలు ఏమైనా ఏర్పాటుచేశారా?

జ: ఖమ్మంఇండస్ట్రియల్ ఏరియాలో రెండుసెంటర్లను కలిపి ఒక మోడల్‌సెంటర్‌గా ఏర్పాటు చేశాం. ప్రైవేటు ప్లేస్కూల్ వలే ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం. భవిష్యత్‌లో మరిన్ని మోడల్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని చూస్తున్నాం.

ప్ర: అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే గుడ్లు, ఇతర సామగ్రి అక్కడక్కడ పక్కదారి పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి...నిజమేనా..?

జ: అలాంటిదేమి లేదు కోడిగుడ్లు నెలకు రెండుసార్లు వస్తాయి. ఒక్కో గుడ్డు 42నుంచి 50గ్రామల వరకు బరువు ఉండాలి. బియ్యం, బాలామృతం, పాలు, పప్పులు, నూనెలు అన్ని కూడా లెక్క ప్రకారంగా ఇస్తాం. సూపర్‌వైజర్లు ప్రతినెలా పర్యవేక్షణ చేస్తున్నారు. గతంలో అలాంటి పరిస్థితులుండేవి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



కనకగిరి అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కిన చిరుత



సీసీ కెమెరాకు చిక్కిన జింకలు



వణ్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటుచేసిన చెక్‌డామ్

వన్య ప్రాణులకు వెన్నుదన్ను

- సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు
- వేసవిలో దాహార్తిని తీర్చేందుకు అడవిలో సోలార్ నీటి పంపులు
- వేటగాళ్ల నియంత్రణకు రాత్రివేళల్లో పెట్రోలింగ్



నీటి చలిమను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): వణ్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. తల్లాడ, కారేపల్లి రేంజ్ పరిధిలో ఏన్కూరు మండలం విస్తరించి ఉంది. తల్లాడ రేంజ్ పరిధిలోని నాచారం, మేడేపల్లి ప్రాంతాల్లో దట్టమైన కనకగిరి అడవులు ఉన్నాయి. కారేపల్లి రేంజ్ పరిధిలో బురదరాఘవాపురం, కేసుపల్లి, తిమ్మారావుపేట, రంగాపురం, మూలపోచారం, నెమలిపురి గ్రామాల్లో అడవులు ఉన్నాయి. ఈ అడవుల్లో ఎలుగుబంట్లు, కొండ గొర్రెలు, జింకలు, కుందేళ్లు, అడవిదున్నలు, కణుజులు, అడవిపందులు, అడవి బర్రెలు నివసిస్తున్నాయి. కనకగిరి అడవుల్లో చిరుత పులుల సంచారం కూడా ఉంది.

వేసవిలో వణ్యప్రాణులు దాహార్తితో వాగులు వంకలు, నీటి గుంటలు, కుంటలు, చెలముల దగ్గరకు వచ్చి వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్నాయి. వేటగాళ్లను నిరోధించడానికి అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అడవుల్లో రాత్రివేళల్లో గస్తీ తిరిగేందుకు నాలుగు పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటుచేసింది. ఒక్కో బృందంలో ఆరుగురు సభ్యులు ఉంటారు. వేసవిలో వణ్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అక్కడక్కడా సోలార్ నీటి పంపుల, నీటి గుంటలు, చలములను ఏర్పాటుచేసి అక్కడ సీసీ కెమెరాలాను ఏర్పాటుచేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ లైన్స్‌ను ఏర్పాటుచేశారు. అడవుల్లో విత్తనాలను సేకరించి వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అటవీ సమీప గ్రామాల్లో సదస్సులు ఏర్పాటుచేసి వణ్యప్రాణి, అటవీ సంరక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అడవుల ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్‌వో ఉమా, డీఆర్‌వో శ్రీనివాస్ నిరంతరం పర్యవేక్షిస్తూ వణ్యప్రాణుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు.



క్రీడాకారిణి పవిత్ర

జాతీయ ఉషూ పోటీల్లో మెరిసిన పవిత్ర

- కాంస్య పతకం కైవసం

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 23 వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా సీనియర్ మహిళల ఉషూ పోటీల్లో నగరానికి చెందిన పవిత్ర కాంస్య పతకం సాధించింది. నిత్యం నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో సాధన చేసే పవిత్ర జాతీయస్థాయిలో ఈ ఘనత సాధించడం మూడోసారి. ఈ సందర్భంగా జాతీయ పోటీలలో పతకం సాధించిన క్రీడాకారిణిని డీవైఎస్‌వో సునీల్ రెడ్డి, పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు. పవిత్ర భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు తమ సాధనను మరింత పెంచాలన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపునకు కృషి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



క్రీడా దుస్తులను పరిశీలిస్తున్న పీవో

భద్రాచలం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో పాటు క్రీడల్లో పాల్గొనే వారికి మన్నికైన క్రీడా దుస్తులు అందించి క్రీడల్లో నిష్ణాతులు చేయడానికి కృషి చేస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలలకు సరఫరా చేసే టీ షర్టు, ట్రాక్ షూ, క్రీడా సామగ్రికి చెందిన టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో మూడు ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేశారని, టెండర్లలో చూపిన రేట్లు కాక అతి తక్కువ ధరకు కోడ్ చేసిన ఏజెన్సీలకు ఈ వస్తువులు సరఫరా చేయడానికి కమిటీ సభ్యుల సమక్షంలో ఆమోదించామన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, ఏటీడీవో అశోక్, జీసీసీ మేనేజరు జయరాజు పాల్గొన్నారు.

టీబీని అరికట్టడం సామాజిక బాధ్యత

- క్షయ నివారణకు కృషిచేద్దాం
- డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి
- జిల్లా కేంద్రంలో ప్రదర్శన



ఆస్పత్రిలో ప్రదర్శన నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి లేకుండా ప్రతి వ్యక్తి కృషిచేద్దామని, క్షయ నివారణ సామాజిక బాధ్యతగా పనిచేద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి పిలుపునిచ్చారు. క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఆస్పత్రిలో ర్యాలీని నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది క్షయ కేసులు తగ్గాయని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది చేసిన కృషికి కేసులు తగ్గిపోయాయన్నారు. గత రెండేళ్ల క్రితం క్షయ నివారణలో దేశ వ్యాప్తంగా జిల్లాకు గుర్తింపు లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో అధికారులు సిబ్బంది క్షయ నివారణకు సమష్టిగా కృషిచేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే పరీక్షల శాంపిల్స్‌ను తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు ఎప్పటికప్పుడు పంపించాలని వైద్య అధికారులకు సూచించారు. జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ వరికుటి సుబ్బారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు గురించి వివరించారు. టీబీ నిర్ధారణ అనంతరం ఉచితంగా టీబీ మందులు ఆశ కార్యకర్త ద్వారా నేరుగా ఇంటికి పంపించనున్నట్లు చెప్పారు. పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రతి నెల రూ.వెయ్యి క్షయ రోగి బ్యాంక్ అకౌంట్‌కి జమ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 35 గ్రామ పంచాయతీలను క్షయరహిత గ్రామ పంచాయతీలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, జిల్లా పంచాయతి అధికారి ఆశాలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, డాక్టర్ బాబురత్నాకర్, బి. కిరణ్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు రామారావు, వెంకటరమణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన 'ఫ్రెండ్ యాప్'..

- ప్రేమ నిరాకరణతో యువకుడి ఆత్మహత్య

మణుగూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్ యాప్‌తో ఓ యువతితో స్నేహాన్ని పంచుకున్న యువకుడు వన్ సైడ్ లవ్‌లో మునిగిపోయి చివరికి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మణుగూరులోని వాసవీ నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వాసవీ నగర్‌లో నివాసముండే సుగ్గుల కార్తిక్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఆన్‌లైన్‌లో ఫ్రెండ్‌యాప్‌లో ఓ యువతితో స్నేహం చేశాడు. ఆమెను వన్‌సైడ్ లవ్ చేసి చివరికి ఆమె ఇతడి ప్రేమను నిరాకరించే సరికి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్నేరులో పడి యువకుడి మృతి

ఖమ్మం రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలోని మున్నేరులో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరంలోని లెనిన్ నగర్‌కు చెందిన సయ్యద్ మౌలానా(19) ఏసీ మెకానిక్‌గా పని చేసేవాడు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలోని వికలాంగుల కాలనీకి చెందిన వంశీ అనే స్నేహితుడి ఇంటికి మౌలానా సోమవారం వెళ్లాడు. ఇద్దరు కలిసి ఈత కొట్టేందుకు పక్కనే ఉన్న మున్నేరులోకి వెళ్లారు. ఈత కొట్టుకుంటూ మౌలానా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. విషయాన్ని వంశీ, అక్కడే దస్తులు ఉతికే మహిళలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో మున్నేరులో గాలించారు. నీటిలో రాళ్లలో ఇరుక్కుని ఉన్న మౌలానా మృతదేహన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం అన్నం శ్రీనివాస్ బృందం ఖమ్మం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మౌలానా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి ..



రాజ్‌కుమార్(ఫైల్)

దుమ్ముగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సున్నంబట్టి గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థి బంటు రాజ్‌కుమార్(19)తోపాటు మరో విద్యార్థి దుర్మరణం చెందారు. సెలవు దినం కావడంతో సాయంత్రం ద్విచక్రవాహనంపై సరదాగా బయటకు వెళ్లారు. ఓయూ సమీపంలోని అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై వాహనం అదుపు తప్పి కింద పడడంతో ప్రమాదస్థలంలోనే ఇద్దరూ చనిపోయారు. మరో విద్యార్థి వివరాలు తెలియాల్సి ఉంది. చదువుల్లో చురుకైన రాజ్‌కుమార్ మృతితో సున్నంబట్టి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా, సోమవారం రాత్రి మృతదేహం ఇంటికి చేరనుంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కరకగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్థారం గ్రామం పరిధిలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పరిసరాల్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సోమవారం కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని.. రెండు సెల్ ఫోన్లు, రూ, 7వేల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు యువత లోనై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఒకే గొడుగు కిందకు మహిళా సంఘాలు

కొత్తగూడెం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు అన్ని ప్రభుత్వ జీవో. 15 ద్వారా ఒకే గొడుగు కిందకు చేరాయి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరా మహిళాశక్తి మిషన్ కింద జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో స్వయం సమాయక సంఘాలకు సంబంధించిన సంస్థాగత నిర్మాణం, రుణాల అనుసంధానం, జీవనోపాధి, వ్యాపార కార్యకలాపాలు అన్ని సెర్ప్ నియంత్రణలోకి రానున్నాయి. జిల్లాలో 15 ఏళ్ల నుంచి 18ఏళ్ల వరకు వయస్సు కలిగిన మహిళలతో స్వయం సహాయక సంఘాలను, 60ఏళ్లు దాటిన వారికోసం వృద్ధ సహాయక సంఘాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ విషయమై మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనను వివరణకోరగా సెర్ప్‌లో వీలినానికి అనుగుణంగా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలుచేసేందుకు అవసరమైన పరిపాలన, సిబ్బంది, నమూన బడ్జెట్ తదితర అంశాలపై కార్యకలాపాలు కొనసాగిస్తామని అన్నారు. కాగా సెర్ప్‌లో 22 మండలాల్లో, నాలుగు పట్టణాలతో కలిపి మొత్తం 1,128 ఎస్ఎల్ఎఫ్‌లో 24,076 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

'సీతారామ' నీళ్లు అందించాలి

- కాల్వల ద్వారా చెరువులు, కుంటలను నింపాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు
- పంప్‌హౌస్‌లను సందర్శించిన సీపీఎం బృందం



రాజీవ్‌లింక్ కెనాల్ వద్ద నిరసనలో సీపీఎం నాయకుల నిరసన

ములకలపల్లి/జూలూరుపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లా సాగు భూములకు నీరు అందించి జిల్లాను సస్యశ్యామలం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఒడ్డు రామవరం, కమలాపురంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను సీపీఎం జిల్లా బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రైతులను మభ్యపెట్టేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే ఆగమేఘాల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభించారని, నమూనా మార్చుతూ రైతులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ప్రాజెక్టు నిర్మాణం, కాల్వల నిర్మాణం సాగుతోందన్నారు. ముందుగా ములకలపల్లి మండలంలో ఉన్న చెరువులు, కుంటలను నింపి మండల రైతులకు సాగు నీరు అందించిన తర్వాతనే ఖమ్మం జిల్లాకు నీరు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగునీరు లేక వేల ఎకరాలు బీడు భూములుగా మారుతున్నాయన్నారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మించి మూకమామిడి, పూసుగూడెం, వీకే రామవరం మండలంలో ఉన్న వివిధ చెరువులు, కుంటలను నింపి మండల రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి జిల్లా రైతులకుసాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

అనంతరం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ వద్ద నిర్మించిన రాజీవ్‌లింక్ కెనాల్ నిర్మాణాన్ని సోమవారం సాయంత్రం సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుమ్ముగూడెం ప్రాజెక్ట్ దగ్గర నుంచి ఇప్పుడు సీతారామ ప్రాజెక్ట్ దాకా జిల్లా రైతులకు సాగునీటిని అందించటంలో అన్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, బాల నర్సారెడ్డి, కే.బ్రహ్మచారి, కారం పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోత్ రావుజా, వూకంటి రవికుమార్, నిమ్మల మధు, ఆదినారాయణ, కుంజా రామ్మూర్తి, సోయం కృష్ణ, గడ్డ వెంకటేశ్వర్లు హేమని, వినోద్, యాసా నరేష్, వెంకటి, కనకరత్నం, రాధాకృష్ణ, అభిమిత్ర, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కేఎండీసీ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

ఖమ్మం స్పోర్ట్స్ మార్చి 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 23న జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారు. సర్ధార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే కళాశాల విద్యార్థులు గోపీచంద్ 400 మీటర్ల పరుగు పోటీలో స్వర్ణ పతకం సాధించగా, గౌతమ్ 100 మీటర్ల పరుగు పోటీలో స్వర్ణం, వివేక్‌చంద్ర 400 మీటర్ల పరుగు పోటీలో కాంస్యం, వీరభద్రం 100 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం సాధించారు. హర్యానా రాష్ట్రంలో ఏప్రిల్ 30 నుంచి జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గౌతమ్, గోపీచంద్ ఎంపికైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్‌లు కోటా అప్పిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారావు పీడీ ఉపేందర్ తదితరులు అభినందించారు.



రామాలయంలో న్యాయమూర్తి శివజ్ఞానం

భద్రాద్రి రామయ్యను దర్శించిన జడ్జి

భద్రాచలం/ దుమ్ముగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని చెన్నై హైకోర్టు న్యాయమూర్తి వి.శివజ్ఞానం దర్శించుకున్నారు. ఆయన ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆయన పర్ణశాల రామాలయాన్ని చెన్నై హైకోర్టు న్యాయమూర్తి వి.శివజ్ఞానం దంపతులు సోమవారం సందర్శించారు. సంప్రదాయ బద్ధంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పర్ణశాల కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్, భద్రాచలం సీఐ బరపాటి రమేష్, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, అర్చకుడు కిరణ్‌కుమారాచార్యులు, ఎస్ఐ గణేష్ సిబ్బంది ఉన్నారు.

ఎస్పీకి సీఆర్‌పీఎఫ్ అభినందనలు



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ

కొత్తగూడెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేసిన ఎస్పీ రోహిత్‌రాజును సోమవారం సీఆర్‌పీఎఫ్ అధికారులు అభినందించారు. సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా నుంచి డీజీ డిస్క్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతరశాఖల అధికారులను సమన్వయం చేస్తూ గడిచిన పార్లమెంట్ ఎన్నికలను సజావుగా జరిగేలా కృషి చేసిన ఎస్పీని సీఆర్‌పీఎఫ్ ఐజీపీ చారుసిన్హా ప్రత్యేకంగా అభినందనలు తెలిపి డీజీ డిస్క్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని సీఆర్‌పీఎఫ్ సౌత్ సెక్టార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్ వీటిన స్వీకరించారు. నిషేధిత మావోయిస్టు ప్రభావిత జిల్లాలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేసి సమర్థవంతంగా పార్లమెంట్ ఎన్నికలను పూర్తి చేసినందుకుగాను ఈ గుర్తింపు లభించింది. జిల్లాలో విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లనే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా పూర్తి చేయగాలిగామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఒక మహిళకు తీవ్ర గాయాలు

ఖమ్మం రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మహిళా కూలీలు వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని ఆరెకోడు వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం గ్రామనికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు ఆటోలో చింతపల్లి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో ఆరెకోడు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో ఆటోలో 14 మంది మహిళా కూలీలు ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ మహిళను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.



రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి24(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం కింద బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, నిరుద్యోగ యువత ఏప్రిల్ 5లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.జ్యోతి సోమవారం తెలిపారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి పెంపు లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించిందని తెలిపారు. ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు నూతన కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అవసరం ఒక చోట..
పనులు మరోచోట!

- నాయకుల ఇష్టారాజ్యం
- ప్రజాధనం దుర్వినియోగం
- తిరుమలాయపాలెంలో పట్టించుకోని అధికారులు

తిరుమలాయపాలెం, మార్చి24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కలిపించడం కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నా అవి సక్రమంగా వినియోగం కావటం లేదు. దశాబ్దాలనుంచి అవసరమైన ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించకుండా నాయకులు తమ ఇష్టానుసారంగా అవసరంలేని చోట లేని ప్రాంతంలో రోడ్లు చేపట్టి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. ఓవైపు ప్రభుత్వం నిధులు లేక ఇబ్బందులుపడుతుంటే ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవడంలేదు. నాయకులు తమకు అనుకూలంగా బంధువులు కోసం రోడ్లు చేపడుతున్నారు. మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల తిరుమలాయపాలెం గ్రామంలో రూ.30లక్షలతో ఆరు పనులు కేటాయించారు. ఆపనలతో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీరోడ్లు పనులు చేపట్టకుండా ఇష్టానుసారంగా చేపట్టారు. వాస్తవంగా ప్రజలకు అవసరమైన చోట సీసీరోడ్లు చేపట్టాల్సి ఉండగా చేపట్టడంలేదు. ఎక్కువ మొత్తంలో ఇసుక, కంకర పోసి నాసిరకంగా పనులు చేపట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రూ.5లక్షలతో మద్దినేని శ్రీనివాస్ ఇంటినుంచి కొప్పుల అశోక్‌కు చెందిన సామిల్ వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. వాస్తవంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా పనులు చేపట్టారు. ఎస్సీకాలనీలో సీసీ రోడ్లు పనులు చేపట్టాలని ప్రజలు కోరినా నా ఇష్టం వచ్చినచోట చేపడతానని చెబుతున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేవలం బిల్లుల కోసమే గ్రామంలో సీసీరోడ్డు పనులు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే ఇస్లావత్ బద్రు ఇంటి ఎదురుగా చేపట్టిన సీసీ రోడ్డు పనులు కూడా కేవలం బిల్లులు కోసమే చేపట్టారని, ప్రజలు విమర్శిస్తున్నారు.ఆప్రాంతంలో కనీసం ప్రజలు తిరిగేందుకూడా రోడ్డు లేదు అయినా సీసీ రోడ్డు చేపట్టారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి సీసీరోడ్లు పనులు ప్రజలకు ఉపయోగపడే ప్రాంతంలో నిరిమంచేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.




సామిల్ వద్ద చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం, ఇస్లావత్ బద్రు బజార్‌లో..

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్ మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ,డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ దరఖాస్తులను సమస్యల రూపంలో అధికారులకు ఏకరువుపెట్టారు.

హెల్త్‌క్లీనిక్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

ఉద్యోగులు, కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ క్లీనిక్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు.కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్త్‌క్లీనిక్‌ను సోమవారం తనిఖీ చేశారు.హెల్త్ క్లినిక్ రూమ్‌లో వెలుతురు అనువుగా ఉండే విధంగా చూడాలని, క్లీనిక్‌లో మహిళా డాక్టర్ విధులు నిర్వహించేలా చూడాలని తెలిపారు. అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సెల్ఫ్‌లు, కుర్చీలు, ఇతర సామగ్రి కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కళావతి బాయి ఉన్నారు.



వృద్ధురాలి సమస్యను వింటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నేడు కేఎంసీ కౌన్సిల్ సమావేశం

2025-2026 బడ్జెట్ ఆమోదానికి కమిషనర్ సమీక్ష

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలకవర్గం కౌన్సిల్ సమావేశం మంగళవారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరగనుంది. మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో 2025-2026 బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ మేరకు సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఎకౌంట్స్, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య, ఉద్యానవన, మెప్మా, ఇతర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కౌన్సిల్ సమావేశానికి కావాల్సిన రికార్డులు, నివేదికలపై సమీక్షించారు. గతేడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రాబోయే సంవత్సరానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏవో శివలింగం, ఈఈ కృష్ణలాల్, వసుంధర, బెల్లం రాధిక, గుడిపూడి సుజాత రాణి, ఇతర విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో రూ.32 కోట్ల ఆదాయ లక్ష్యం పూర్తి కావాలి

ఖమ్మం నగర పాలకంలో ఆదాయ వసూళ్ల లక్ష్యం మేరకు రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతలు నిర్వహించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం నగరంలోని పలు డివిజన్లలో ఆదాయ వసూళ్ల కేంద్రాలను తనిఖీలు చేశారు. క్షేత్రస్థాయిలో బిల్‌కలెక్టర్లు, వార్డుఆఫీసర్లు ఆదాయ వసూళ్ల తీరును పరిశీలించారు. రెవెన్యూ ఉద్యోగులు ఉదయం 8గంటల నుంచే ఆదాయ వసూళ్లు చేపట్టాలని కీలకమైన వారం రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. వారం రోజుల్లో మరో రూ.5 కోట్లు బకాయిలు వసూళ్ల చేసి కేఎంసీ ఆదాయ వసూళ్ల లక్ష్యం రూ.32 కోట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.



విభాగాల అధికారులతో రివ్యూ నిర్వహిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

'ఆశా' వర్కర్ల ముందస్తు అరెస్టు

నేలకొండపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌కు బయల్దేరిన ఆశా వర్కర్లను నేలకొండపల్లి పోలీసులు సోమవారం తెల్లవారుఝామున ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆశాలు మాట్లాడుతూ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేయటం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా పోలీసులతో అరెస్ట్ చేయించటంలో ఆంతర్యమేమిటన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు.



నేలకొండపల్లిలో అదుపులోకి తీసుకున్న ఆశా కార్యకర్తలు

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు

తిరుమలాయపాలెం, మార్చి24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ డివిజన్ కార్యదర్శి బండి రమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఎదటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రదర్శనగా బయలుదేరి తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలు పట్టించుకోవటం లేదన్నారు. మండల కేంద్రానికి నిధులు కేటాయించాలన్నారు. మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్రాంచి, షాపింగ్‌కాంప్లెక్స్, సెంట్రల్‌లైటింగ్, తిరుమలాయపాలెంలో 130మందికి ప్లాట్లు ఇచ్చి స్థలం చూపలేదని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లానాయకులు యర్రా శ్రీనివాసరావు, బషీరుద్దీన్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, ఎ.నరసయ్య, వి.వీరన్న, ఎన్.వెంకటేష్, మద్దినేని శ్రీను, పప్పుల ప్రసాద్, ఎస్.రాము, కె.వెంకన్న, మంగతాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

- ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మంరూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపల్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాల్లో సోమవారం కమిషనర్ పర్యటించారు. పారిశధ్యం, ఇంటిపన్నుల వసూళ్ల పనితీరును ఆయన పరిశీలించారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది హెచ్చరించారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని ఈ ఆర్థిక సంవత్సరం 31తో ముగుస్తున్నందున వెంటనే పన్నులు వసూల్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మధిర పాలిటెక్నిక్ కళాశాల సామగ్రి వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం మధిర పాలిటెక్నిక్ కళాశాల ల్యాబ్ పరికరాలకు రూ.10 లక్షల విలువైన పరికరాలను అందజేశారు. స్టేట్ టెక్నికల్ బోర్డు, సాంకేతికశాఖ కమిషనర్ అనుమతితో వితరణగా అందించారని మధిర కళాశాల ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు తెలిపారు. సోమవారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు విచ్చేసి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో మెకానికల్ డిపార్టుమెంట్‌ను ఉపసంహరించుకున్నందున వాటిని ఇతర విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండటానికి కళాశాలకు అందజేశామని కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, వివి శివప్రసాద్ పాల్గొన్నారు.



కృష్ణను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

టీఎన్జీవో నగర అధ్యక్షుడిగా బెజ్జం

ఖమ్మంకలెక్టరేట్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో ఖమ్మం నగర అధ్యక్షుడిగా బెజ్జంకి ప్రభాకరాచారి నియమితులయ్యారు. సోమవారం టీఎన్జీవో భవన్‌లో ఖమ్మం నగర కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నగర కమిటీ అధ్యక్షుడుగా ఉన్న రమణ యాదవ్ పదవీ విరమణ పొందడంతో ప్రభాకరాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర కమిటీ తీర్మానాన్ని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, దుర్గాప్రసాద్, జైపాల్ విజయ్‌కుమార్, శ్రీధర్ సింగ్ తాళ్లూరి శ్రీకాంత్, కరణ్‌సింగ్, రాధా కృష్ణ,ఎర్రమల్ల శ్రీనివాసరావు, రుక్మారావు,కోమలి,ఖమ్మం నగర కమిటీ కార్యదర్శి ఆంజనేయులు,శంకర్, రవికుమార్ ,శ్వేత,కాంతారావు దిలీప్,ఉదయ్,శ్రావణి, రఫీ ,కిరణ్,ప్రసన్నకుమార్,పృథ్వీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పలువురిని పరామర్శించిన పువ్వాడ

రఘునాథపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రఘునాథపాలెం మండలంలో సోమవారం పర్యటించారు. ఇటీవల ప్రమాదంలో కాలుకు గాయమైన భద్యాతండా మాజీసర్పంచి భూక్య సుగుణను పరామర్శించారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వీరూనాయక్, ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం బీరెడ్డి నాగచంద్రరెడ్డి, మెంటం రామారావు, లఘుపతి, గౌస్‌కుమార్,లాల్ చంద్, కుమార్ పాల్గొన్నారు. మారం లక్ష్మారెడ్డి దశదిన కర్మ ఖమ్మంలో జరగ్గా పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇఫ్తార్ విందులో..

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని 37వ డివిజన్ టీకే బజార్‌లో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థన చేసి మాట్లాడారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ముస్లీం సోదరులు ఎంతో నిష్ఠతో రంజాన్ మాసం మొత్తం ఉపవాస దీక్షల్లో ఉంటారని అన్నారు.



లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

పదోతరగతి పరీక్షకు 16,344 మంది హాజరు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి24 (ఆంధ్రజ్యోతి): సోమవారం నిర్వహించిన పదోతరగతి ఆంగ్ల పరీక్షకు 16,344 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మొత్తం 16,376 మందికి 16,344 మంది పరీక్షకు హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ లోకల్‌బాడీ ఒక పరీక్ష కేంద్రాన్ని, డీఈవో 6పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 38 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.

సీపీఐ డివిజన్ కార్యదర్శిగా జ్వాల

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి24(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ నగర 51వ డివిజన్ కార్యదర్శిగా జ్వాల నర్సింహారావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన డివిజన్ సమితి సమావేశంలో జ్వాల ఎన్నికను సీపీఐ నగర సమితి ప్రకటించారు.



58వ డివిజన్‌లో యుగంధర్ పర్యటన



నాయకులు రంగారావుతో తుమ్మల యుగంధర్

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని మారుమూల ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం 58వ డివిజన్‌లో స్థానిక నాయకులు శెట్టి రంగారావుతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు పాశం గోపాలరావు, తోకల రవికుమార్, సమ్మిరెడ్డి, దూళిపాళ్ల శ్రీనివాసరావు, సంకెపల్లి కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాసరావు, నాంపల్లి శంకరయ్య, నల్లమల వేణు, బోడా వీరన్న, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి

ఖమ్మంరూరల్,మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డు, మద్దులపల్లి గ్రామాల్లో భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ 94వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి, నండ్రా ప్రసాద్, పి.సంగయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

కాయకల్ప బృందం పరిశీలన

నేలకొండపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): సోమవారం నేలకొండపల్లి సీహెచ్‌సీని చర్లకు చెందిన కాయకల్ప పీర్ ఎసెస్‌మెంట్ బృందం సందర్శించింది. వైద్యశాల పరిసరాలను పరిశీలించింది. వైద్యశాలలో సిబ్బంది రోగులకు అందిస్తున్న సేవలు, వారి నైపుణ్యతతో పాటు వైద్యశాలలో ఉన్న మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాయకల్ప పీర్ ఎసెస్‌మెంట్ టీం డాక్టర్ సాయివర్ధన్, సీనియర్ నర్సింగ్ అధికారి శైలజ, నేలకొండపల్లి వైద్యాధికారి రాజేష్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకుడు వెంకటేశ్వర్లు

ఖమ్మంరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నేతగా సీపీఐ నాయకుడిగా కడదాకా కమ్యూనిస్టుగా కొనసాగిన మిరియాల వెంకటేశ్వర్లు యువతకు స్ఫూర్తిదాయకుడని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో సోమవారం వెంకటేశ్వర్లు 13వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్, రామ్‌కోటి, సురేందర్, శంకర్‌రెడ్డి, రాము, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వైష్ణవి

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి24(ఆంధ్రజ్యోతి): మంత్రితుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం నగరానికి ముఖ్యమంత్రి సహాయ నిధి డబ్బులు మంజూరు జరిగాయని 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి పేర్కొన్నారు. డివిజన్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కార్పొరేటర్ లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.

శ్రీరామనవమి కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పర్ణశాల రామాలయ ఉత్సవాల కరపత్రాలను డివిజన్ కార్పోరేటర్ చావా మాధురినారాయణరావు, ఆలయ ఈవో వనం వెంకట నరసింహారావు సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు వసంత నవరాత్రి ఉత్సవములు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం శోభాయమానంగా జరుగనున్నది. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ, ఏప్రిల్ 5న ఆలయంలో మొట్టమెదటిసారి సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీహెచ్‌పీ నేత విశ్వనాథం కన్నుమూత

తిరుమలాయపాలెం, మార్చి24(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ జిల్లా మాజీ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన దాచేపల్లి విశ్వనాథ్(90) ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు. మృతుడికి నలుగురుకుమారులున్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడుగా వ్యవహరించారు సుమారు 30ఏళ్లపాటు ఉపాధ్యాయుడుగా పనిచేశారు. వీహెచ్‌పీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు ఆయన భౌతికకాయాన్ని సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నున్నా రవి కుమార్, అల్లిక అంజయ్య, మండల అధ్యక్షుడు బొడ్డుప్రసాద్, నల్లగట్టు ప్రవీణ్, ఉపేందర్, ఆర్యవైశ్య సంఘ నాయకులు సింగవరపు సత్యనారాయణ, రేపాకుల కిషన్‌రావు తదితరులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు రుణ లబ్ధిదారుల ఎంపిక

నేలకొండపల్లి,మార్చి24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రుణ లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మర్రి యర్రయ్య సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ లబ్ధిదారులు మంగళవారం ఉదయం ఐకేపీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని ఎంపీడీఓ ప్రకటనలో కోరారు.

'న్యూవిజన్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి24(ఆంధ్రజ్యోతి): 'ఇస్కాన్' సంస్థ నిర్వహించిన పోటీల్లో న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఇటీవల నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో 'ఇస్కాన్'(ఇంటర్నేషనల్ సొసైటీ కృష్ణ కాన్సియస్‌నెస్)సంస్థ నైతిక విలువలు పెంపొందించుటకు ఈ పోటీలు నిర్వహించింది. భగవద్గీతఆధారిత ఆధారంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. పోటీలో కన్సికరెడ్డి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించింది. ట్యాబ్‌ను అందుకుందని వారు తెలిపారు. పాఠశాల విద్యార్థులు దీప్తి, ప్రతీక, లక్ష్మి, సరయు, యశ్విత ఉత్తమ ప్రతిభ కనపరిచారని చెప్పారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ అబాద్ అలీ, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్‌అలీ

27న సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు

సత్తుపల్లిరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27వ తేదీన జరగనున్నాయి. మొత్తం 96మంది ఓటింగ్‌లో పాల్గొనుండగా ఇప్పటికే ఉపాధ్యక్షుడిగా కేశన శంకరరావు, జనరల్ సెక్రటరీగా సాధు కృష్ణయ్య, లైబ్రరీ సెక్రటరీగా నల్లగట్ల విజయకుమార్, గేమ్స్, స్పోర్ట్స్ సెక్రటరీగా జేవీ.నరేంద్ర, ఈసీ మెంబర్లుగా ఐ.నరసింహారావు, గుంట్రు శ్రీనివాసరావుల ఉపసంహరణల అనంతరం ఎన్నిక ఏకగ్రీవమైంది. కాగా అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు మల్లెపూల వెంకటేశ్వరరావు, పి.రామనరసింహారావు, కోశాధికారులుగా వంకదారు రామకృష్ణ, మహదేవ జనార్ధనాచారిలు పోటీ పడుతున్నారు. లేడీ రిప్రజంటేటివ్, జాయింట్ సెక్రటరీ పదవులకు ఎవరూ ఆసక్తి చూపలేదు.

సత్తుపల్లి మునిసిపల్ టీపీబీవోగా వెంకటకిరణ్



సత్తుపల్లిరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ (టీపీబీవో)గా మద్దెల వెంకటకిరణ్ నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన ముందుగా మునిసిపల్ కమిషనర్ కే.నర్సింహను కలిసి ఆర్డర్ కాపీ అందజేశారు. మండలంలోని రేజర్లకు చెందిన ఈయన 2015లో స్వగ్రామంలో 10వ తరగతి, బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేయగా తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన టీసీపీ పరీక్షల్లో వెంకటకిరణ్ ఉత్తీర్ణత సాధించి ఈ ఉద్యోగ నియామకానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఈయన పట్టణంలో అనధికార నిర్మాణాల తనిఖీ, ఆక్రమణల తొలగింపు, పరిశోధన, పర్యవేక్షణ, స్థల మూల్యాంకనాలు వంటి ప్రణాళిక విధుల్లో సహాయం చేయనున్నారు. అదేవిధంగా చైన్‌మెన్ సహాయంతో సర్వేలు, ఇతర క్షేత్రస్థాయి పనులు, మున్సిపల్ రికార్డులు సక్రమంగా నిర్వహించబడుతున్నాయా, రక్షించబడుతున్నాయా అని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామీ హింద్ సత్తుపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మున్వర్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజలంతా పండుగను సంతోషంగా జరుపుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జామే మసీద్ సదర్ జనాబ్ నాయబ్‌రసూల్, చల్లగుళ్ల నరసింహారావు, ఎండీ.కమల్‌పాషా, అమిర్‌జానీ, సమీ, జానీ, బాషా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

28న బహిరంగ వేలం

ఏన్కూరు, మార్చి24(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ ప్రాంగణం నందు భక్తులు తలనీలాల పోగు చేసుకునేందుకు ఈనెల 28న శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ఖమ్మం సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంగణం నందు వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగినవారు పాల్గొనాలని కోరారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదించాలని కోరారు.

ఈజీఎస్ ఓపెన్ ఫోరం

కారేపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గల ప్రజావేదికలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సింగరేణి-16వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేందర్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

బోనకల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో సోమవారం ప్రభుత్వ భూములను తహసీల్దార్ పున్నమ్ చందర్ పరిశీలించారు. ఐకేపీ ద్వార గోదాంల నిర్మాణాలు చేసేందుకు సర్వే నంబర్ 220లో గల 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ఐకేపీ అధికారులతో కలిసి ఆయన చూశారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు ప్రభుత్వ భూమి మధ్యలో గుండా కొనసాగితే భూమి ఎక్కువగా వృథా అవుతుందని, వేరే మార్గం నుంచి చేస్తే బాగుంటుందని తహసీల్దార్ సదరు కాంట్రాక్టర్, అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గృహయోగం ఎప్పుడో..?

» బిల్లులు రాక పునాదులకే పరిమితమైన గృహలక్ష్మి పథకం

» ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పలువురి వినతి



బిల్లులు రాక నిలిచిపోయిన గృహలక్ష్మి పథకం ఇల్లు

వేంసూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం కింద 453 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 130మంది లబ్ధిదారులు తమకున్న చిన్నపాటి గుడిసెలు, రేకుల షెడ్లను తొలగించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణాల కోసం అయినకాడికి అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆతర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునే స్థోమత లేక నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుతం లబ్ధిదారులు అద్దె ఇళ్లు, పూరి గుడిసెల్లో నివాసముంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గృహలక్ష్మి పథకం అటకెక్కింది. గృహలక్ష్మి పథకం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పేదలు కోరుతున్నారు.

అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాం

● కాటే జ్యోతి, అడసర్లపాడు



గతంలో మాకు గృహలక్ష్మి పథకం ఇల్లు మంజూరైంది. అప్పటివరకు ఉన్న గుడిసెను తొలగించి, ఇంటి నిర్మాణాన్ని చేపట్టాము. మొదట విడత కింద అయినకాడికి అప్పులు చేసి మరీ పునాదుల వరకు ఇంటి నిర్మాణాన్ని చేపట్టాం. ఆతర్వాత ఎన్నికలు రావడంతో బిల్లులు నిలిచిపోయాయి. ప్రస్తుతం అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నాం.

రేకుల ఇంటిని నిర్మించుకున్నాం

● పురం రాధ, అడసర్లపాడు



తమకు గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరైంది. గతంలో ఉన్న తాటాకు ఇంటిని తొలగించి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాం. పునాదుల వరకు నిర్మించిన తర్వాత బిల్లులు రాక పోవడంతో నిలిపివేశాం. అప్పులు చేసి ఇల్లు కట్టుకునే స్థోమత లేకపోవడంతో ప్రస్తుతం పక్కనే రేకుల షెడ్ వేసుకొని నివాసముంటున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వృద్ధురాలు చెబుతున్న సమస్యను వింటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్ మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కలెక్టరేట్‌కు వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్త్‌క్లినిక్‌ను సోమవారం తనిఖీ చేశారు. హెల్త్‌క్లినిక్ రూమ్‌లో వెలుతురు అనువుగా ఉండే విధంగా చూడాలని, క్లీనిక్‌లో మహిళా డాక్టర్ విధులు నిర్వహించేలా చూడాలని తెలిపారు. అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సెల్ఫ్‌లు, కుర్చీలు, ఇతర సామగ్రి కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

సమర్థ నాయకులను ఎన్నుకుందాం

» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్



కాకర్లపల్లిలో మాట్లాడుతున్న రమేష్

సత్తుపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒకేసారి ఎన్నికలు జరిగితే దేశం ఆర్థికంగా, అభివృద్ధి పరంగా, ప్రజాధనం దుర్వినియోగం కాకపోవడంతో పాటు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా సమర్థవంతమైన నాయకులను ఎన్నుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ.రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని కాకర్లపల్లిలో ఒకేదేశం-ఒకే ఎన్నికలో భాగంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యం, సంప్రదాయాన్ని మరింత ప్రభావవంతంగా, సజావుగా మార్చే దిశగా కీలక ముందడుగు ఇదేనన్నారు. ఆర్థిక, పనిభారం తగ్గి ప్రభుత్వ అధికారులు సైతం ప్రజా సమస్యలపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని, ఇదే విషయాన్ని పార్టీలకతీతంగా ప్రచారం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాలకొల్లు శ్రీనివాస్, జొన్నలగడ్డ నరేష్, సాలి శివకృష్ణ, చీకటి వసంతరావు, షేక్ సుబానీ, తెనాలి అశోక్, కోమటి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

» జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజ్

చింతకాని, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రైతు రుణ మాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఇచ్చిన హామీను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రైతుల్ని నమ్మించి మోసం చేసిందని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసే ప్రయత్నం చేస్తుందని, ఇప్పటికే రుణమాఫీ ఇవ్వమని వ్యవసాయశాఖ మంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించాడని, త్వరలో రైతు భరోసాను కూడా నిలిపి వేస్తామని ప్రకటించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై రైతులు, సామాన్య ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, బొడ్డు వెంకటరామారావు, వేముల నర్సయ్య, పోట్ల సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు చర్యలు: సీడీపీవో

ఏన్కూరు, మార్చి24(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు సీడీపీవో దయామణి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 0-18 ఏళ్ల పిల్లల బాల్యవివాహాలు, చట్టపరమైన దత్తత చైల్డ్‌లేబర్ తదితర అంశాలపై వివరించారు. బాల్య వివాహాలపై ప్రతి ఇంటిని సందర్శించి చైతన్య పరచాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి సోని ప్రేమలీనా, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీవో సకినాల రమేష్, ఏవో నరసింహారావు, ఎంఈవో రహీంబీ, ఎస్ఐ రఫి, వైద్యాధికారి మౌనిక, పశువైద్యాధికారి సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, ఏడబ్ల్యూటీ సుశీల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో దయామణి

బాధిత కుటుంబానికి మధు, సండ్ర పరామర్శ



శిరీష చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధుసూదన్, వెంకటవీరయ్య

ముదిగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి భిక్షం కుమార్తె శిరీష ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. సోమవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శిరీష చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భిక్షం కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, బంకా మల్లయ్య, కోటి అనంతరాములు, వీరనారాయణ, మల్లేపల్లి శంకర్, వెంకటేశ్వర్లు, నాగార్జున పాల్గొన్నారు.

భాగ్యమ్మకు నివాళులర్పించిన నెల్లూరి

వైరా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని లాలాపురంలో సోమవారం జరిగిన చింతనిప్పు భాగ్యమ్మ దశదినకర్మల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు. భాగ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ, సుదర్శన్ మిశ్రా, నల్లగట్ల ప్రవీణ్‌కుమార్, మందడపు సుబ్బారావు, మాదినేని సత్యనారాయణ, ఓర్సు శ్రీను, చెరుకూరి కృష్ణారావు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బోనకల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన సర్వే చేసిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని సోమవారం యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రెమ్యురేషన్ చెల్లించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, అధ్యక్షుడు గార్లపాటి రంగారావు, నాయకులు గోపాలరావు, కోటయ్య, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో వేణుయాదవ్

ముదిగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు నేలవాలిన మొక్కజొన్న పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి వేణుయాదవ్ పరిశీలించారు. 'నేలవాలుతున్న ఆశలు' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా వ్యవసాయ అధికారులు మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేలవాలిన మొక్కజొన్న పంట నష్టం అంచనాలను తయారుచేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఏవో వేణుయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో తల్లాడకు అవార్డులు



డీఎంహెచ్‌వో నుంచి అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి రత్నమనోహర్

తల్లాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలన కార్యక్రమంలో విశేష సేవలందించిన తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అవార్డులు దక్కాయి.

సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో విశేష సేవలందించిన తల్లాడ మండల వైద్యాధికారి ఐ.రత్నమనోహర్‌కు ఉత్తమ వైద్యాధికారి, సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్యకు ఉత్తమ నోడల్ ఆఫీసర్, ఆశ కార్యకర్త జె.శాంతమ్మకు ఉత్తమ సేవ పురస్కారాలు దక్కాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుబ్బారావు ముగ్గురికి అవార్డులను బహూకరించారు. అవార్డులు పొందిన వైద్యసిబ్బందిని ఉపజిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం, సీహెచ్‌వో భాస్కర్ తదితరులు అభినందించారు.

'మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలి'



మొక్కజొన్నలను పరిశీలిస్తున్న నాయకులు

కొణిజర్ల, మార్చి24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రాబాబు కోరారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో కళ్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయపోవడం దారుణమన్నారు. దళారులు ఇష్టం వచ్చిన రేటుతో మొక్కజొన్నలను కొండుటున్నారని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రైతులను అకాలవర్షాలు భయపెడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం రైతులు బాధలను తెలుసుకొని వెంటనే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి కోటేశ్వరరావు, గడల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ షేక్ సైదులు, యర్రా వెంకన్న, వీరభద్రం, లాలయ్య, కొమరయ్య, రవి, జానికిరాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులందరికీ యువ వికాస పథకం వర్తింపచేయాలి

» సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి వీరభద్రం



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

కొణిజర్ల, మార్చి24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం నిరుద్యోగులందరికీ వర్తింపచేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం కొణిజర్ల సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా రాజీవ్ యువ వికాస్ పేరుతో మళ్లీ దరఖాస్తు చేసుకోమని చెబుతుంటే గతంలో మంజూరైన లబ్ధిదారులలో తీవ్ర ఆందోళన కలుగుతుందని అన్నారు. వీరందరికీ రాజీవ్‌యువ వికాస్ పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి కూడా ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆయా కార్పోరేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న రుణాలు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతా లో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, మోత్కూరి వెంకటేశ్వర్లు, చెరుకుమల్లి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

సత్తుపల్లిరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించుకున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం లో 16రోజుల పండుగ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు యలబాక సత్యనారాయణ, మాధవి, దాయక దుర్గారావు, ఉమ, వేమవరపు సురేష్‌శర్మ, రమాదేవి సహకారంతో అభిషేకములు, అన్నప్రసాద వితరణ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



ఆలయం వద్ద అన్నదానంలో భక్తులు



జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కారేపల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామపంచాయతీ వర్కర్లు

తల్లాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు డి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటోతేదీన వేతనాలు ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలుచేయాలన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ వర్కర్ల పెండింగ్ వేతనాలు, మల్టీపర్పస్ విధానం రద్దు వంటి అంశాలపై మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పంచాయతీ వర్కర్లు తెలిపారు. సోమవారం ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. మండల సీఐటీయూ కార్యదర్శి కె.నరేందర్ ఆధ్వర్యంలో అధికారులను కలసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అనంతమ్మ ఆశయాలు సాధించాలి

బోనకల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి సొసైటీ డైరెక్టర్, సీపీఐ మండల సమితి సభ్యుడు మరీదు శ్రీనివాసరావు సతీమణి అనంతమ్మ(54) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సీపీఎం నాయకులు చిట్టుమోదు నాగేశ్వరరావు, కేతినేని నాగేశ్వరరావులు సందర్శించి సంతాపం తెలిపారు.